క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని స్టాఫ్ నర్స్ ధార్మిక అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టిక వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త రాధ, రజున, భాగిర్థ, రబ్బాని పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడుకుందాం

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కులను కాపాడుకుందామని జై ఆదివాసీ యువశక్తి జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు పెందూర్ రాజేశ్వర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. ఉట్నూర్ మండల అధ్యక్షుడిగా ఆత్రం ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా మడావి బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా అర్క విజయ్, సంయుక్త కార్యదర్శిగా మెస్రం జగన్, టేకం బాబురావు, అర్క అంకుశ్, సునీల్, కిరణ్, ముకుంద్‌లను ఎన్నుకున్నారు.

ఓటరు నమోదు సద్వినియోగం చేసుకోండి

తలమడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం, ఆదివారం నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు, ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌స్టేషన్ అధికారి శివాజీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఫైర్‌స్టేషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై న్యాక్ ద్వారా శిక్షణ పొందుతున్న భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రమేశ్, నాగేంద్రం పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 50 కేసులు పరిష్కారం

ఇచ్చోడ: లోక్ అదాలత్‌లో భాగంగా పెండింగ్‌లో ఉన్న డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రికింగ్, కరోన నిబంధనలు అతిక్రమించిన 50 మందికి బోథ్ మున్సిఫ్ కోర్టు జడ్జి హుస్సేన్ జరిమానా విధించి, 50 కేసులు పరిష్కరించినట్లు ఇచ్చోడ ఎస్సై నరేశ్ తెలిపారు. శుక్రవారం బోథ్‌లో నిర్వహించిన లోక్ అధాలత్‌లో నేరస్తులను ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు.

ఏఎన్‌ఎంల నిరసన

కైలాస్‌నగర్: రాత పరీక్షతో సంబంధం లేకుండా తమను యధావిధిగా రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 18వ రోజుకు చేరుకుంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేసేలా ప్రభుత్వానికి జ్ఞానోదయం కల్పించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు సమ్మె శిబిరం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులు స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి

కైలాస్‌నగర్: విద్యార్థులను స్వతంత్ర పాఠకులుగా ఎదగాలని రూమ్ టూ రీడ్ జిల్లా కోఆర్డినేటర్ ఉప్పల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం బ్రాహ్మణవాడ ప్రాథమిక పాఠశాలలో రీడ్ ఏథాన్ కార్యక్రమం నిర్వహించారు. రూమ్ టు రీడ్ సంస్థ దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో 681 మంది విద్యార్థులు, 44 మంది ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో రూమ్ టూ రీడ్ ఫెసిలిటేటర్లు మహేందర్, ఆదిల్, అజిత్, వేణుగోపాల్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ప్రతిభను గుర్తించడం హర్షనీయం

ఎదులాపురం: కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని షార్ట్ ఫిలిమ్స్ డైరెక్టర్ అర్జున్ లింగాల అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి మొట్ట మొదటిసారిగా షార్ట్ ఫిలిమ్స్ ప్రదర్శించడం సంతోషంగా ఉందన్నారు. మన ఊరి పల్లె యూట్యూబ్ చానల్ వీడియోస్‌ను హైదరాబాద్‌లోని రవీంద్రభారతి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ప్రదర్శించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నటులు విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని వినతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయం వద్ద కళ్యాణ మండపం నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్సీ దండె విఠల్, స్థానిక నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. వారి వెంట బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ తదితరులున్నారు.

పల్లెకు రాని పల్లెవెలుగు


సిరికొండలో ప్రైవేట్ వాహనాలు

- కానరాని ఆర్టీసీ బస్
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

సిరికొండ: నూతనంగా మండలం ఏర్పాటు చేసిన ప్రభుత్వం మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించ లేదు. మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కు. మండల కేంద్రానికి కనీసం బస్ సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం

మండల కేంద్రం నుంచి ఇతర మండలాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించాల్సిందే. ఆటోలో, జీపులో ప్రయాణికులు నిండే దాక వాహనం కదలదు. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. వాహనం పూర్తిగా ప్రయాణికులతో నిండిన తర్వాతనే ఇక్కడి నుంచి కదులుతుంది. అత్యవసర సమయంలో సొంతగా అద్దెకు తీసుకొని వెళ్లాలి.

ఆర్థికంగా నష్టపోతూ..

ప్రైవేట్ వాహనాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదం అని తెలిసిన గత్యంతరం లేక ప్రయాణిస్తున్నారు. విద్యార్థులకు, ఉద్యోగులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నారు. సమయం వృథాతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్ సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమయానికి వెళ్లలేక పోతున్నాం



సిరికొండ మండల పరిషత్ పాఠశాల్లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నాను. ప్రతీరోజు ఇచ్చోడ నుంచి ఇక్కడి పాఠశాలకు వస్తాను. బస్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రైవేట్ వాహనాల కోసం వెచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– స్వర్ణలత, ఉపాధ్యాయురాలు, సిరికొండ

బస్ సౌకర్యం కల్పించాలి



ప్రభుత్వం ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సిరికొండ మండలానికి బస్ సౌకర్యం కల్పించాలి. ఇచ్చోడలోని ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను. నాకు వచ్చే జీతం చాలా తక్కువ. వచ్చిన జీతం ప్రైవేట్ వాహనాల ఛార్జికే సరిపోతోంది.

–పూసం మారుతి, సిరికొండ

అమరుల త్యాగాలు చిరస్మరణీయం


ఆదిలాబాద్: మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఆదిలాబాద్: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన నామట్టి.. నాదేశం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారన్నారు. ఢిల్లీలో నిర్మించనున్న అమృత్ వాటికకు మట్టిని పంపాలన్నారు. కార్యక్రమంలో ఆదినాథ్, జోగు రవి, మయూర్ చంద్ర, సోమ రవి, ధోని జ్యోతి, వేదవ్యాస్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఢిల్లీలో అమృత్ వాటిక నిర్మాణం కోసం ప్రతీ గ్రామం నుండి మట్టి సేకరణ చేస్తున్నామని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఖానాపూర్ అసెంబ్లీ నాయకులు రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శాంతినగర్, సేవదాస్‌నగర్, ఎన్టీఆర్ నగర్‌కాలనీలో మట్టిసేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాంచందర్, కొండేరి రమేశ్, భాగ్యలక్ష్మి, బొడ్డు కిరణ్, లింగాగౌడ్, దేవిదాస్, రవి, రవీందర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ ఆధ్వర్యంలో నామట్టి.. నాదేశం కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పవిత్ర అమృత వాటికను నిర్మాణానికి మట్టిని సేకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, గోద్రు కేవల్‌సింగ్, పెరుగు సంతోష్, చట్ల వినిల్, నారడి లింగన్న పాల్గొన్నారు.

బోథ్: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మర్లపెల్లి, నిగిని, కంటేగాం, బాబెరా, గురుదేవ్ నగర్ గ్రామాల్లో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో నాయకులు చాబంతుల కృష్ణ, తుకారాం, రమేశ్, అనిల్, శ్రీకాంత్, లింగారెడ్డి, గంగారాం పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

ఇచ్చోడ: ప్రజ యుద్ధనౌక గద్దర్ ఆశయ సాధనకు పని చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు గాదె ఇన్నయ్య, హరిభూషన్, అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో షార్ప్ గార్డెన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన గద్దర్, సియసాత్ సంపాదకులు జహీరొద్దిన్ అలీఖాన్‌ల సంస్మరణ సభలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పాడిన తెలంగాణ కేసీఆర్ చేతిలో బంది అయిందన్నారు. రాష్ట్రాన్ని విముక్తి చేయడం కోసం తెలంగాణ ఉద్యమకారులు కలిసి కట్టుగా ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, మావోయిస్టు మాజీ సీసీ సభ్యులు జంపన్న, మావోయిస్టు మాజీ సభ్యులు మురళి, అజయ్, గజ్జల గంగారెడ్డి, రాధ, జ్యోతి, విజయ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌రూరల్: మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి ఏఎస్సై సునీత అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, 1930 నంబర్, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, పోక్స్ యాక్ట్ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ యశోద, హెడ్‌కానిస్టేబల్ సత్యమోహన్, విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ స్వచ్ఛత పాటించాలని డీఆర్డీవో కిషన్ అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని శుక్రవారం సందర్శించి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌- 2023 అవార్డులో భాగంగా అభివృద్ధి, స్వచ్ఛత పనులు పరిశీలించారు. ఈనెల 2న గ్రామాన్ని కేంద్ర బృందం సందర్శిస్తారని తెలిపారు. గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌- 2023 అవార్డు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. అదనపు డీఆర్‌డీవో రవీందర్, సర్పంచ్ తుంరం బాగుబాయి, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీఆర్ఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: మాజీ మంత్రి, దివంగత కాంగ్రెస్ నాయకుడు చిల్కూరి రాంచంద్రారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. రాంచంద్రారెడ్డి లాంటి రాజకీయ నాయకులు అరుదుగా ఉంటారని అలాంటి నాయకుడిపై సోషల్ మీడియాలో కొంత మంది అనుచిత, అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రభుత్వ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కోర్టా- చనాక బ్యారేజ్‌కు రామచంద్రారెడ్డి పేరు పెట్టాన్నారు. ఎమ్మెల్యే జోగు రామన్నను ఓడించాలనేది సీఆర్ఆర్ ఆశయమని, ఆశయ సాధన కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో సంతోష్, భరత్ వాగ్మారే, శంకర్, షకీల్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

కైలాస్‌నగర్: రానున్న ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జైనథ్ మండలంలోని జామిని గ్రామస్తులు, పట్టణంలోని దుర్గానగర్ కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రాజెక్టులను నిర్మించి వేలాది ఎకరాలకు సాగునీటిని అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మడావి సోనేరావు, నైతం సోము, విష్ణుకుమార్, నాని పాల్గొన్నారు.

‘ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోస్ట్ కార్యాలయంలో తిరగబడుదాం.. తరిమికొడుదాం కార్యక్రమంలో భాగంగా సీఎం కార్యాలయానికి పోస్ట్‌కార్డులు వేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేస్తున్న అక్రమాలపై కాంగ్రెస్ తరుపున ప్రజా చార్జీషీట్ వేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యురాలు చారులత రాథోడ్, ఖయ్యూం, నాయకులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలి

ఎదులాపురం: బూత్‌స్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. పట్టణంలోని 16వ వార్డు అధ్యక్షుడు షేక్ ఇర్ఫాన్, 9వ వార్డు దుర్గానగర్ అధ్యక్షుడిగా లింగన్న, 30వ వార్డు బొక్కలగూడ అధ్యక్షుడిగా రజాక్‌లను నియమించినట్లు తెలిపారు. తమ వార్డుల్లో 15 మందితో కూడిన బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

స్పౌజ్ పెన్షన్ అప్‌డేషన్ వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో గజానన్ రావ్

జైనథ్: స్పౌజ్ పెన్షన్‌ల అప్‌డేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో గజానన్ రావ్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. పెన్షన్ కలిగి ఉన్న భార్య, భర్తల్లో ఎవరైన ఒకరు మరణించడంతో ఆ కుటుంబంలో పెన్షన్ ఆగిపోయిన కేసులను వెంటనే గుర్తించాలన్నారు. అలాంటి వారి వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకట్ రాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ


వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

తాంసి: ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం వలన ఆరోగ్య దెబ్బతింటుందని అందుకే యదాశంకర్ మెమోరియల్ ట్రస్టు తరపున స్టీల్ బాటిళ్లను పంపిణీ చేస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ సంగిశెట్టి బాబు తెలిపారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని భీంపూర్, అర్లి(టి), పిప్పల్‌కోటి, గోన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్, బ్యాగులు అందజేశారు. చైర్మన్ సంగిశెట్టి బాబు, డైరెక్టర్‌లు జీవన్ కుమార్, సమీర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్, హెచ్‌ఎం శిల్ప, జ్యోతి, శంకర్, నగేశ్‌రెడ్డి, ఏలియా, సూర్యకళ పాల్గొన్నారు.

సమాచారం

పరామర్శ

బోథ్: మండలం కన్గుట్ట గ్రామానికి చెందిన నల్ల లింగన్న సతీమణి నర్సమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. కాగా తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంట అశోక్, శీను, రాజు రెడ్డి, చినయ్య, రాములు, శివన్న, రమేశ్, గంగన్న, రాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని గొలిగూడలో అంగన్‌వాడీ టీచర్లతో సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న ఒక పూట సంపూర్ణ భోజనం కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని కొనసాగుతున్న దీక్షలు శుక్రవారం 48వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్షలో డివిజన్ సాధన సమితి సభ్యులు కూర్చున్నారు. రానున్న ఎన్నికల లోపు బోథ్‌ని డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సన్మానం

నేరడిగొండ: మండలంలోని కోరటికల్(బి) గ్రామానికి చెందిన గోతి దినేష్, గోతి సాయిరాం, బస్సి శశికుమార్, బొంత బ్రహ్మంలు ఆర్మీ ఎస్ఎస్‌సీ జీడీకి ఎంపికవడంతో గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, సర్పంచ్ బర్దవల్ శ్రీనివాస్, గోతి ఉమేష్, బర్దవల్ వినోద్, సాబ్లే గోవింద్, సాయి, నానక్ సింగ్, మేర్‌బాన్, మంగులాల్, గులాబ్‌సింగ్, విజయ్, రాంసింగ్ పాల్గొన్నారు.

అన్నాభావుసాతే డివిజన్ కమిటీ ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: సాహిత్య సామ్రాట్ అన్నాభావుసాతే డివిజన్ కమిటీ సమావేశం ఆదివారం ఉట్నూర్‌లో నిర్వహించడం జరుగుతుందని గణేశ్, రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాంగ్ కులస్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ అధికారులు

కైలాస్‌నగర్: ఆర్టీసీ అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్‌ఎం సోలమన్, డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్ కలెక్టర్‌ను కలిసి పూల మొక్క అందజేశారు.

కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలిగా రాజమ్మ

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా కొరుట రాజమ్మ, ఉపాధ్యక్షురాలిగా నైతం శుభంగిని నియమిస్తూ ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ నియామక పత్రాలు అందజేశారు. కోత్మబాయి, ధరియావంతి, లలిత పాల్గొన్నారు.

ప్రచార రథం ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: ఎన్నికల ప్రచారం కోసం ప్రచార రథాన్ని శుక్రవారం జెడ్పీటీసీ చారులత రాథోడ్ ప్రారంభించారు. శుక్రవారం హనుమాన్ మందిరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొమ్ము విజయ్, సునీల్ జాదవ్, మల్లారెడ్డి, బచ్చల రవి పాల్గొన్నారు.

అవార్డులు ఇవ్వాలి

కైలాస్‌నగర్: గిరిజన సంక్షేమశాఖలో పనిచేసే ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలని టీఎస్ టీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవి, డీఈవో ప్రణీతలకు వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికలో తమను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లా గిరిజన క్రీడల అధికారి కొరెడ్డి పార్థసారథి, బానోత్ రవీందర్, అడే సునీల్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇంద్రవెల్లి: మండలంలోని ఇన్కార్‌గూడ గ్రామానికి చెందిన తాపిమేస్త్రీ జాడి తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం విశ్వనాథ్, కార్మికులు మడావి నగేశ్, చందు, శివనాథ్, ధర్మేందర్, శివ, జనార్దన్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

- నిరసన తెలిపిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు


నార్నూర్: వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


తలమడుగులో..

నార్నూర్: సీపీఎస్‌ను రద్దు చేసి.. ఓపీఎస్‌ని పునఃరుద్ధరించాలని ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నార్నూర్, గాదిగూడ మండలాల్లో నిరసన తెలిపారు. శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం శేఖర్ మాట్లాడుతూ.. పెన్షన్ పొందడం ప్రభుత్వ ఉద్యోగికి భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు అడే విశ్వనాథ్, శివాజీ, పుష్పలత, మెస్రం లింగు, తుకారం, రామారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాంసి: పాత పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని పీఆర్‌టీయూ భీంపూర్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల ఉపాధ్యక్షుడు ఉప్పం తిరుపతి, కార్యదర్శి ఈశ్వర్, ఉపాధ్యాయులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

- తాంసి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విష్ణు కుమార్‌కు ఉపాధ్యాయులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శి రవీందర్, అసోసియెట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.

తలమడుగు: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మహేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తాహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, హెచ్‌ఎం, వినోద్ రెడ్డి, నగేశ్, వెంకట్ రమణ, లెనిన్, లలిత, సుమలత, గంగయ్య పాల్గొన్నారు.

ఇచ్చోడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని శుక్రవారం నర్సాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అశోక్, శేషరావు, విఠల్, హెమ్‌న్‌రావు పాల్గొన్నారు. బోరిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో శ్యాంసుందర్, వినోద్‌కుమార్, కృష్ణ, రవీందర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా మండల కేంద్రంలోని స్పోర్ట్స్ పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కపిల్‌కుమార్‌జాదవ్, గంగారాం, మనోజ్, నాగోరావు, ప్రభాకర్, హేమంతన్, సవిత తదితరులు పాల్గొన్నారు. దంతన్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు.

ఆదిలాబాద్‌టౌన్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని జాక్టో, ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం వేర్వేరుగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యార్థి బీఎడ్ కళాశాలలో జరుగుతున్న ఉన్నతి శిక్షణ కేంద్రం వద్ద జాక్టో ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా, కోలిపుర ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మురళి, గోపాలకృష్ణ, శేఖర్, సుకుమార్, రవి జబాడే, ముజఫర్ హుస్సేన్, గోమత్ రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: పాత పెన్షన్ అమలు చేయాలని ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండల వ్యాప్తంగా ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఓపీఎస్ ముద్దు అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

‘కాంగ్రెస్ టికెట్ ఆదివాసీలకు ఇవ్వాలి’


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇచ్చోడ: బోథ్ కాంగ్రెస్ టికెట్ ఆదివాసీ తెగల వారికే ఇవ్వాలని ఆదివాసీ సంఘం నాయకులు, బోథ్ కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్న కొడప జాలై జాకు, కుంరకోటేశ్వర్, జల్కే పాండురంగ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో మాట్లాడారు. బోథ్ నియోజకవర్గం నుంచి 18 మంది దరఖాస్తులు చేసుకున్నారని, ఆదివాసీలలో తొమ్మిది తెగల వారు ఏడుగురు ఉన్నారని తెలిపారు. ఆదివాసీలలో ఎవరికీ టికెట్ ఇచ్చిన కలిసి కట్టుగా పనిచేస్తామన్నారు.